క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలతో విద్యార్థులు

ఎచ్చెర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రంథాలయ ఆవరణలో ప్రతి విద్యార్థి మొక్కను నాటాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం లావేరు శాఖా గ్రంథాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో రైజింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళీధర్, ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలోసర్వం కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం పరామర్శించారు. రూ.పది వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూర్మనాథాలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల రద్దీ

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథున్ని వైశాఖ మాస మూడో ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా శ్వేత పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతా రామనృసింహాచార్యులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు లక్ష్మీసన్నిధి, వైష్ణవిదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. ఆలయ ఈవో కె.నరసింహనాయుడు భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

వైభవంగా కాళీమాత ఉత్సవాలు



ముర్రాటలు తీసుకెళ్తున్న భక్తులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడ గ్రామంలో ఆదివారం కాళీమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏటా వైశాఖమాసం మూడో ఆదివారం కాళీమాత ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మంగళవాయిద్యాలు, మేళ తాళాలు, కర్రసాములు చేస్తూ గ్రామ పురవీధుల్లో ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. మహిళలు ముర్రాటలతో బయలుదేరి కాళీమాత ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

ఎచ్చెర్లలో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని ఎచ్చెర్ల గ్రామంలో పాత జాతీయ రహదారిపై ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. సైనికులు సాహస పరాక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉద్యానవనం.. అధ్వానం!



విజయ ఆదిత్య పార్కు ప్రవేశ ద్వారం



పార్కులో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

అసాంఘిక పనులకు అడ్డాగా విజయ ఆదిత్య పార్కు

- మందుబాబులకు ఆశ్రయంగా మారిన వైనం
- అటవీ ప్రాంతాలను తలపిస్తున్న పరిసరాలు
- పట్టించుకోని పాలకులు

ఎక్కడైనా పార్కు కనిపిస్తే ఆహ్లాదం కోసం లోపలికి వెళ్తాం. అక్కడి పరిసరాలను ఆస్వాదిస్తాం. ఆట పరికరాలతో కాసేపు ఆడుతూ సేద తీరుతాం. అయితే నగర పరిధిలోని విజయ ఆదిత్య పార్కు రూటే సెపరేటు. ఇక్కడ ఎప్పుడు చూసినా అసాంఘిక పనులే. ఓవైపు మందు బాబులు, మరోవైపు లవర్స్ ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉంటారు. ఇలాంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పేరుకు కార్పొరేషన్ అయినప్పటికీ నగర పరిధిలో ఆహ్లాదాన్నిచ్చే పార్కు ఒక్కటీ లేదు. నగర సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని విజయ ఆదిత్య పార్కు ఉన్నా నిర్వహణను గాలికొదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సీపన్నాయుడుపేట ప్రాంతంలో ఉన్న ఈ పార్కులో పగలు రాత్రి అనే తేడా లేకుండా నిత్యం మందుబాబులు ఆశ్రయం పొందుతుంటారు. కొందరు ప్రేమికులు సైతం ఈ పార్కునే అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చుకుంటున్నారు.

సెటిల్‌మెంట్లు సైతం..

భూ వివాదాలు, ఇతర సెటిల్‌మెంట్లు చేసుకునే వారు సైతం ఇక్కడే లావాదేవీలు చేస్తుంటారు. ఏదైనా తేడాలొస్తే హత్యలు వరకు వెళ్లిన ఘటనలూ ఉన్నాయి. పార్కుపై పర్యవేక్షణ లేకుండా గేట్లు తీసి ఉంచడంతో ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పార్కు అన్ని వైపులా పొలాల్లోంచి దారులు ఉండటంతో అన్ని రకాల పనులు ఇక్కడ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

రూ 2.54కోట్లు మంజూరైనా..

ఇక్కడ పార్కు మధ్యలో చెరువు ఉంది. పార్కుతో పాటు చెరువును అభివృద్ధి చేసేందుకు అమృత్ 2.0 పథకం కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.54కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా మోదం తెలిపారు. పూర్తిస్థాయిలో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) తయారుచేయాలని అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కనీసం దృష్టి సారించకపోవడంతో పార్కు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.

శాఖల మధ్య సమన్వయ లోపం..

పార్కును అభివృద్ధి చేసేందుకు ఓ వైపు మున్సిపల్ అధికారులు.. మరోవైపు పర్యాటకశాఖ.. ఇంకో వైపు సుడా అధికారులు తొలుత దృష్టి సారించారు. అయితే ఎవరికి నచ్చినట్లు వారు డిజైన్లు చేయడంతో చివరకు ఎవ్వరూ ఈ పార్కును అభివృద్ధి చేయలేదు. దీంతో పార్కు మొత్తం అడవిని తలపిస్తోంది. ఎక్కడికక్కడ ముళ్లపొదలు పెరిగిపోయి దారుణంగా తయారైంది.

ఆహ్లాదం కరువు..



విజయ ఆదిత్య పార్కులో ఆటపరికరాలు, మొక్కలు వేసి ఆహ్లాదకరంగా మార్చాలి. పార్కు మొత్తం అడవిని తలపిస్తోంది. లోపలికి వెళ్లాలంటే భయమేస్తోంది. ఈ పార్కును బాగుచేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తే బాగుంటుంది.

– ఎంద రమేష్, బాయమ్మతోట, శ్రీకాకుళం



అడవిని తలపిస్తున్న చెరువు మధ్యభాగం



పార్కులో నడకదారిలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

అభివృద్ధి చేస్తాం..

నగర సమీపంలో ఉన్న విజయ ఆదిత్య పార్కును అభివృద్ధి చేస్తాం. పర్యాటకశాఖను సమన్వయం చేసి సుడా నిధులతో పార్కు రూపురేఖలు మారుస్తాం. వీలైనంత తొందరలో పార్కు బాగు చేస్తాం. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తాం.

– డి.అమర్‌నాథ్, ప్లానింగ్ ఆఫీసర్, సుడా, శ్రీకాకుళం

రోడ్డుకు మోక్షమెప్పుడో?



నవభారత్ కూడలి నుంచి పెయ్యిలవానిపేట, కొంచాలకూర్మయ్యపేట, దోమాం వరకు మూడు కిలోమీటర్లు ఉన్న రహదారి గోతులమయంగా మారింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

బాబోయ్ కుక్కలు



గెడ్డకంచరాం, నాగులవలస, పెంట, సీతంపేట, నడిమివలస, మత్రివలస, వాండ్రంగి, జి.సిగడాం తదితర గ్రామాల్లో పిచ్చిమొక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆవుదూడలు, మూగ జీవులపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో వీధిలోకి రావాలంటేనే చిన్నారులు, వృద్ధులు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– జి.సిగడాం

అర్ధంతరంగా ఆపేశారు!



జి.సిగడాం మండలంలో నక్కపేట నుంచి టిడివలస వరకు బీటీ రోడ్డు పనులు అర్ధంతరంగా ఆపేశారు. మెటల్ పూర్తిగా పైకి రావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉండటంతో నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

వైద్య శిబిరానికి స్పందన



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

శ్రీకాకుళం కల్చరల్: మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లి వీధి వద్ద జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, కటకం, మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులను సత్కరించారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫల్గుణరావు

రణస్థలం: విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, ముఖ్యంగా నేటి తరం దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.ఫల్గుణరావు అన్నారు. వీహెచ్‌పీ మహిళా విభాగం దుర్గావాహిని ఆధ్వర్యంలో గోసాం గ్రామ రామ మందిరం వద్ద బాలికలకు ప్రాంతశౌర్య శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉండాలన్నారు. మానసిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు యువతకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర బాలికలు, యువతులకు అనకాపల్లిలోని దత్తపీఠంలో ఈ నెల 27 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో దుర్గావాహిని జిల్లా ప్రముఖ్ హైంది, సుస్మిత, హిందూ పరిషత్ జిల్లా బాల సంస్కార్ ప్రముఖ్ గుంటుకు శ్రీధరరావు, గ్రామ సర్పంచ్ కంబపు రామిరెడ్డి, గ్రామపెద్దలు కంబపు అప్పలనాయుడు, సీరపు తవుడు, రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్ –2025 ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎచ్చెర్ల మండల పరిధిలోని చిలకపాలెం శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్ల వెంకటేశ్వరా కాలేజీ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

కూటమి ప్రభుత్వంలోనే దళితులపై దాడులు



ముంజేటి కృష్ణమూర్తి

గార: కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాకే దళితులపై దాడులు పెరిగాయని, భవిష్యత్తులో వీటికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో బీటెక్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసి, మూత్రం తాగించిన ఘటనపై ప్రభుత్వం స్పందించి సంఘటన పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా దళిత హోం మంత్రి, ఎస్సీ మంత్రులు, ఎస్సీ సామాజిక ఎమ్మెల్యేలు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఈ ప్రభుత్వం కాలరాస్తుందోన్నారు. దళితులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు, మహిళలు, ఎస్సీలపై దాడులు చేసే సంస్కృతి పెరిగిపోయిందన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను బహూకరిస్తున్న వినోద్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఆర్‌జీకేయూటీ శ్రీకాకుళం క్యాంపస్ గణితం అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.వినోద్‌కుమార్ పిల్లలకు, పెద్దలకు సంబంధించి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పుస్తకాలను బలగ గ్రంథాలయానికి ఆదివారం బహూకరించారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో పిల్లలకు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్ మాస్టారు, గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతుడు ఆదర్శప్రాయుడు



ప్రసాదరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: హనుమంతుడు ఆదర్శప్రాయుడని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం 'శ్రీ హనుమత్ వైభవం'పై ప్రసంగించారు. రామాయణ మహాయజ్ఞంలో శ్రీరాముడు యాజి కాగా, సర్వకార్య నిర్వహణా దక్షుడు హనుంతుడు రుత్విజుడయ్యాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పతంజలి శాస్త్రి, సూరిబాబు, విశ్వేశ్వరరావు, మురళీకృష్ణ, నరసింహమూర్తి, మోహనరావు, కామేశ్వరరావు, అప్పలకొండ, పట్నాయిక్, లత, లక్ష్మీ, సరస్వతి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధికి భక్తుల తాకిడి



పుష్కరిణి వద్ద భక్తుల ప్రత్యేక స్నానాలు, పూజలు

- ఒక్కరోజులోనే రూ.13.04 లక్షలు ఆదాయం
- ప్రత్యేక ప్రసాదాలను నివేదించిన మహిళలు



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 అంబులెన్సు



సంప్రదాయ ప్రసాదాల నివేదన పూజలు చేస్తున్న మహిళలు

అరసవల్లి: వైశాఖమాసం మూడో ఆదివారం సందర్భంగా అరసవల్లి సూర్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. గ్రామీణ ప్రాంత మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు సర్వదర్శనాలకు అనుమతించారు. రూ.300, రూ.100తో పాటు వీఏపీ, ఉచిత దర్శనాల మార్గాల్లో భక్తులు దర్శనాలు చేసుకునేలా ఆలయ ఈవో కె.శోభారాణి చర్యలు చేపట్టారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటిని ఉచితంగా పంపిణీ చేసినా భక్తులకు ఉక్కపోత తప్పలేదు. టెంట్లు కూడా పూర్తి స్థాయిలో వేయకపోవడంతో ఎండ తీవ్రతను చవిచూడాల్సి వచ్చింది. కాగా, అరసవల్లి-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. ఈ క్రమంలో 108 అంబులెన్సు కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. ఆదివారం ఒక్క రోజున రూ.13,04,116 మేరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. వివిధ దర్శనాల టికెట్ల ద్వారా రూ. 9,45,900, ప్రత్యేక పూజలు, విరాళాల ద్వారా రూ.78,216, ప్రసాదాల విక్రయాల టికెట్ల ద్వారా రూ.2.80 లక్షల వరకు ఆదాయం లభించిందని వివరించారు.

దళితులకు దారేదీ?



రోడ్డును ఆక్రమించి వేసిన బోరు



నిర్మాణంలో ఉన్న ఇల్లు

- రోడ్డును బ్లాక్ చేసి బోరు వేసిన కూటమి నేత
- ఇబ్బందుల్లో స్థానికులు

శ్రీకాకుళం రూరల్ : రాగోలు పంచాయతీ పరిధిలోని రాగోలుపేటకు చెందిన కూటమి నేత తన పలుకుబడితో రోడ్డును బ్లాక్ చేసేశాడు. దళితులు రాకపోకలు సాగించే రహదారిని ఆక్రమించి ఏకంగా బోరు వేసేశాడు. ఇదేంటని స్థానికులు ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. ఎస్సీ కాలనీ నుంచి రెండు వీధులను కలిపే ప్రధాన నడక రహదారిని రాగోలుపేట గ్రామస్తులు వాడుకుంటున్నారు. ఇప్పుడు ఇదే రహదారిలో ఏకంగా బోరుతో పాటు ఇల్లు కూడా కట్టేయడంతో ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీతో పాటు వార్డు ఇన్‌చార్జికి ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాం..



రోడ్డును ఆక్రమించి కూటమి నేత లోపింటి గురునాథం బోరు తవ్వేశాడు. అదే రహదారిలో ఇల్లు నిర్మాణం చేస్తుండటంతో ప్రశ్నించడంతో మాపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. దిక్కున్నచోట ఫిర్యాదు చేసుకోమన్నాడు. దీంతో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాం.

– పి.అప్పారావు, రాగోలుపేట

ఇబ్బంది పడుతున్నాం..



రోడ్డుపై అడ్డంగా బోరు తవ్వేడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇదే విషయాన్ని పంచాయతీ సెక్రటరీ, వార్డుమెంబర్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. దళిత కాలనీ ఉన్నా రోడ్డు కబ్జాకు గురైంది.

– ఎల్.శేఖర్, రాగోలుపేట

నోటీసులు ఇచ్చాం..

రోడ్డును ఆనుకుంటూ బోరు తవ్వేసిన లోపింటి గురునాథం నోటీసులు ఇచ్చాం. ఇదే విషయాన్ని సర్పంచ్ గేదేల చెంగల్వరావు దృష్టికి తీసుకెళ్లాను. బోరు తొలగించేందుకు ఆయన రెండు రోజులు గడువు అడిగారు.

– తిరుమలదేవి, పంచాయతీ సెక్రటరీ, రాగోలు